క్లుప్తంగా

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు: వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉన్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సెలవుల్లో ఊళ్లకెళ్లే వారు ముందస్తుగా తమకు సమాచారం అందించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే తమకు తెలియజేయాలని చెప్పారు. రాత్రి వేళ పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు.

గృహ నిర్బంధం అన్యాయం

తోటపల్లిగూడూరు: చింతోపు సర్పంచ్ లేబూరు మల్లికార్జున్ బాకీ ఉన్నారనే కారణంతో, వారి కుటుంబసభ్యులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని స్థానిక మహిళలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడారు. సర్పంచ్‌గా చింతోపు పంచాయతీకి ఎంతో మంచి చేశారని, పరిస్థితులు బాగా లేక అప్పుల పాలయ్యారని చెప్పారు. ఐపీ పెట్టి తన ఇద్దరు కుమారులతో కలిసి మరో ప్రాంతంలో మల్లికార్జున్ తలదాచుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో మగవారు లేని సమయం చూసి అప్పు ఇచ్చిన వారు మల్లికార్జున్ ఇంటి ముందు టెంట్ వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వృద్ధురాలు, ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు వారం రోజులుగా గృహ నిర్బంధంలోనే మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధురాలి ఆరోగ్యం బాగాలేకపోతే పరామర్శకు వెళ్లిన స్థానికులపై నిరసనకారులు గొడవకు దిగుతున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మల్లికార్జున్ కుటుంబసభ్యులను గృహ నిర్బంధం నుంచి విడిపించాలని కోరారు.

ఉచితంగా ఖత్నాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని షాదీమంజిల్‌లో ఉలామా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఉచితంగా ఖత్నాలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు అందజేశారు. సామాజిక సేవలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. వైద్యులు హమీద్, సమద్ నజీర తదితరులు పాల్గొన్నారు.

5న ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట షాదీమంజిల్‌లో మే 5న ఉచిత ఖత్నాలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖత్నా చేయించిన చిన్నారులకు గోధుమ పిండి, రాగిపిండి, గుడ్లు, మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 89777 22178, 80192 05416 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యల్లో విఫలం

తోటపల్లిగూడూరు: కోట్లాది రూపాయల విలువ జేసే పంచాయతీ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని వరిగొండ పంచాయతీకి చెందిన గండవరపు వెంకటరామిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. వరిగొండ బీసీ కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 514, 623, 624, 625లో రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని తమ లేఅవుట్లో కలిపేసుకున్నారని ఆరోపించారు. పంచాయతీకి వదిలిన స్థలాన్ని వరిగొండకు చెందిన అధికార పార్టీ ముఖ్య నేత ఇతరులకు విక్రయించారని చెప్పారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

గుడిసెను కూల్చి రోడ్డున పడేశారు

తోటపల్లిగూడూరు: రోడ్డు పక్కన గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్న తనకు తీవ్ర నష్టాన్ని కలగజేశారని కృష్ణారెడ్డిపాళెం దళితకాలనీకి చెందిన దామవరపు ఏసుదాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఘటన స్థలం వద్ద సీపీఎం కార్యకర్తలతో కలిసి ఆదివారం నిరసన చేపట్టిన అనంతరం బాధితుడు మాట్లాడారు. కోవెరపాళెం క్రాస్‌రోడ్డులో పూరి గుడిసెను వేసుకొని ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్నానని, అయితే పక్కనే చేపల గుంట సాగు చేస్తున్న కొందరు.. అధికార పార్టీ నేతల అండతో తమ గుడిసె, జీవనాధారంగా ఉన్న టిఫిన్ అంగడిని ధ్వంసం చేశారని ఆరోపించారు. దాదాపు రూ.50 వేల విలువైన సామగ్రిని మాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

పది రోజుల పాటు బైబిల్ పాఠశాల

నెల్లూరు(బృందావనం) : బాప్టిస్ట్ చర్చి డానీహాల్ ఆధ్వర్యంలో వేసవి బైబిల్ పాఠశాల(వీబీఎస్) సోమవారం నుంచి పదిరోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చర్చి సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ వద్దగల చర్చిలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల చిన్నారులు పాల్గొనవచ్చని వివరించారు.

అటకెక్కిన సంపద సృష్టి

చెత్త నుంచి సంపద సృష్టి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఆర్భాటపు ప్రకటనలు వాస్తవ రూపంలో అమలు కావడం లేదు. ఆచరణకు సాధ్యం కాని విధానాలను ప్రభుత్వం అమలు చేస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఫలితాలు ఉండడం లేదు. దీంతో వీటిని ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా సంపద సృష్టించలేక చతికలబడి ఉన్నాయి.

- నిధులివ్వకుండా ముందుకు సాగడమెలా?
- ఇలాగైతే జవసత్వాలు కష్టమే
- దిష్టిబొమ్మల్లా సంపద కేంద్రాలు



కొడవలూరు కేంద్రంలో నిరుపయోగంగా..

కొడవలూరు : మండల పరిధిలో చిన్న, పెద్ద సంపద కేంద్రాలు 11 ఉన్నాయి. అయితే ఇవి పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. వాస్తవానికి గ్రీన్ అంబాసిడర్‌లుగా పిలువబడే పారిశుద్ధ్య కార్మికులు ఇంటి నుంచే తడి పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రానికి తరలించాలి. ఇందుకు ప్రభుత్వం ఒక్కో గ్రీన్ అంబాసిడర్‌కు రూ.6 వేలు వేతనం కింద చెల్లిస్తోంది. అయితే ఈ జీతంతో పారిశుద్ధ్య పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వీరికి నెలసరి వేతనం కనీసం రూ.12 వేలైనా ఇవ్వకుంటే పనులకు రావడం లేదన్న విషయాన్ని అధికారులు స్పష్టంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. అయితే వాస్తవ సమస్యలను పట్టించుకోకుండా పనులు చేయించాలని కార్యదర్శులపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. దీని వల్ల ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

వానపాముల ఎరువుతో లాభపడేనా

సంపద కేంద్రాల్లో నిర్మించి ఉన్న తొట్టెలలో వానపాముల ఎరువును ఉత్పత్తి చేసి తద్వారా సంపద రాబట్టాలని ప్రభుత్వం సూచిస్తోంది. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే దీని ద్వారా లాభం రాబట్టడం సాధ్యం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానపాముల ఎరువు ఉత్పత్తికి కూలీలకయ్యే ఖర్చులను పోల్చి చూస్తే ఇందులో లాభం రాబట్టడం కష్టమని ఇట్టే చెప్పవచ్చు. ఎందుకంటే వానపాముల ఎరువును కిలో రూ.10ల లెక్కన రైతులకు విక్రయించాల్సి ఉంది. రసాయన ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు వానపాముల ఎరువుపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ ఎరువుకు ఆశించిన స్థాయిలో గిరాకీ ఉండడం లేదు. ఒకట్రెండు కేంద్రాల్లో ఎరువును ఉత్పత్తి చేసి కూడా విక్రయించుకోలేక బస్తాలు కట్టి మూలన పడేసిన సందర్భాలున్నాయి.

ఏం చేయాలంటే

ప్రభుత్వం చెల్లించే ఆరు వేల వేతనానికి పారిశుద్ధ్య కార్మికులు లభ్యం కానందున వారి వేతనాలను పెంచి పనులకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వమే ఓపెన్ టెండర్ పిలిచి పారిశుద్ధ్య కార్మికులను తీసుకోవాలి. దంపుడు యంత్రాలు వినియోగంలోకి వస్తే ప్లాస్టిక్ ముడి పదార్థంగా మార్చి విక్రయించడం ద్వారా లాభం పొందే వెసులుబాటు ఉన్నందున విద్యుత్ త్రీఫేజ్‌కయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలి.

దంపుడు యంత్రాలూ నిరుపయోగమే

సంపద కేంద్రాల్లో ప్లాస్టిక్‌ను ఆడించి ముడి పదార్థంగా మార్చే యంత్రం, న్యాప్ కిన్స్, పాత గుడ్డలు, రబ్బరు, గాజు వస్తువులను పొడి చేసి వాటిని దగ్ధం చేసే యంత్రాలను పంపిణీ చేశారు. ప్రాధాన్యతా క్రమంలో తొలుత కొడవలూరుకు రెండు యంత్రాలను 2016లోనే ఇచ్చారు. వీటిని వినియోగంలోకి తెస్తే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. కానీ అందుకు విద్యుత్ శాఖ నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పొందాలి. అందుకు గానూ విద్యుత్ శాఖ వారు రూ.10 లక్షల వరకు డిపాజిట్ అడుగుతున్నారు. అంత మొత్తంలో చెల్లించే శక్తి పంచాయతీలకు లేకపోవడంతో ఇవి కూడా నిరుపయోగంగానే ఉండిపోయాయి.

పారిశుద్ధ్య కార్మికులు దొరకడం లేదు



ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు నెలసరి వేతనం రూ.6 వేల వంతున చెల్లిస్తోంది. దీంతో కార్మికులు ఆసక్తి చూపడం లేదు. ఇతరత్రా పనులకు వెళ్తే ఎక్కువ చెల్లిస్తుండడంతో అటువైపే మొగ్గుచూపుతున్నారు. వీరి నెలసరి వేతనం కనీసం రూ.10 వేలైనా చేస్తే తప్ప పారిశుద్ధ్య పనులకు వచ్చేలా లేరు. దంపుడు యంత్రాలతో లాభదాయకమైనప్పటికీ వాటికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పొందడం పంచాయతీలకు సాధ్యం కావడం లేదు.

– కె.మురళి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ, కొడవలూరు

కొడవలూరు మండలంలో ఇలా..	
పంచాయతీలు	24
సంపద కేంద్రాలు	11
నిరుపయోగంగా ఉన్నవి	11
పూర్తయిన పెద్ద కేంద్రాలు	03
పూర్తయిన చిన్న కేంద్రాలు	08
పెద్ద కేంద్రం నిర్మాణానికి రూ.5.60 లక్షలు	
చిన్న కేంద్రం నిర్మాణానికి రూ.2.25 లక్షలు	



వినియోగంలో లేక దంపుడు యంత్రాలు ఇలా..



పిచ్చి చెట్లతో అడవులను తలపిస్తున్న బసవాయపాళెం కేంద్రం



యల్లాయపాళెంలో దిష్టిబొమ్మను తలపిస్తూ..



ఆహ్లాదంగా తీర్చిదిద్దినా వెలవెలబోతున్న గౌతమ్‌నగర్‌లోని కేంద్రం

గంగమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలు చెరువు గట్టున వెలసిన గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో హాజరై గంగమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

కొడవలూరు : స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, క్రీడలు తదితరాల్లో శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **మనుబోలు:** స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులను సోమవారం నుంచి జూన్ ఆరు వరకు నిర్వహించనున్నామని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కథలు వినడం, పుస్తకాలు చదవడం, వాటిని విశ్లేషించడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం తదితరాలను నేర్పించనున్నామని వివరించారు. చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించనున్నామని, విశ్రాంత ఉద్యోగులు తమ సేవలను అందించాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న సీఐ శ్రీనివాసులురెడ్డి, కమిషనర్

- పెద్ద ఎత్తున పాల్గొన్న యువత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణ పరిధిలో ఆదివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. స్థానిక డీఎల్ఎన్నార్ పాఠశాల నుంచి చెన్నూరు రోడ్డు, వైఎస్సార్ విగ్రహం, జొన్నవాడ సంటర్ నుంచి డీఎల్ఎన్నార్ వరకు 2కే రన్ విజయవంతంగా సాగింది. సీఐ శ్రీనివాసులురెడ్డి, నగర కమిషనర్ బాలకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి పాల్గొని, మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ ఏదో ఒక వ్యాయామం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం వ్యాయామాన్ని మన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సువార్తలో భాగస్వాములు కావాలి



వాక్యోపదేశం వింటున్న భక్తులు

కొడవలూరు : దేవుని రాజ్య సువార్తలో భాగస్వాములు కావాలని హైదరాబాద్‌కు చెందిన వాక్యోపదేశకుడు ఎస్.తిమోతి కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న 'ది సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చి'లో శుక్ర, శని, ఆదివారాల్లో కోతకాలపు పండగలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. దేవునికి ఆకర్షితులై ఆయన సూచించిన మంచి మార్గంలో నడిస్తే ప్రభువే కాపాడుతారని సూచించారు. కార్యక్రమంలో సంఘ కాపరి జాకోబ్ సుధీర్, సంఘ చైర్మన్ సి.జోనాథన్, సంఘ కార్యదర్శి సూరి నెహమ్య, కోశాధికారి ప్రదీప్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



పొదలకూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పట్టణంలోని నిర్మలానందస్వామి నిత్యయోగా కేంద్రంలో ఆదివారం సత్కరించారు. వీరికి జ్ఞాపికలను అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. యోగా గురువు పెంచలయ్య, ఉపాధ్యాయుడు పెంచలరెడ్డి, లక్కాకుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

తోటపల్లిగూడూరు: మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ వెంకటేశ్వరపట్టపుపాళెంలో మత్స్యకారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆదివారం హాజరైన ఆయన మాట్లాడారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాలకు చెందిన 1887 మంది మత్స్యకారులకు రూ.3,77,40,000ను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని వివరించారు. మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, నేతలు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, వీరబోయిన గంగాధర్, ఆవుల మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



హమీద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన డాక్టర్ షాహుల్ హమీద్ నీట్ ప్రవేశ పరీక్షలో 69వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షాహుల్ ఆదివారం శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం విడుదలైన నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన హమీద్ జాతీయ స్థాయిలో 69వ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. ఈ ఘన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఖాస్మి, షామీర్, సలీం, వినయ్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడండి

కోవూరు : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు డేవిడ్ చిన్నబాబు అన్నారు. కోవూరు మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. తరువాతి కాలంలో అవి కూడా మూతపడే స్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొవ్వొత్తుల ర్యాలీ



మనుబోలులో..

మనుబోలు: ఉగ్రవాదం మానవాళికే పెనుముప్పుగా పరిణమించిందని మనుబోలు ముస్లిం మైనార్టీ నేతలు పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాకిస్తాన్ అండదండలతోనే కశ్మీర్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు, వారి వెనకున్న శక్తులను తుదముట్టించాలని కోరారు.

- **వెంకటాచలం:** కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా మండలంలోని కసుమూరులో కొవ్వొత్తుల ర్యాలీని గ్రామస్తులు నిర్వహించారు.

స్థానిక వీవర్స్ కాలనీ నుంచి గంగమెట్ల వరకు ర్యాలీ సాగింది. పార్టీలకతీతంగా నేతలు పాల్గొని పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.



వెంకటాచలం: కసుమూరులో..

• సందడే.. సందడి



తోటపల్లిగూడూరు: వేసవి సెలవులు.. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు గానూ కోడూరు తీరాన్ని పలువురు ఆదివారం ఆశ్రయించారు. దీంతో కోడూరులో సందడి నెలకొంది. పిల్లలు, యువత గంటల కొద్దీ సముద్ర స్నానాలతో ఆనందంగా గడిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన రాకపోకలు సాయంత్రం ఆరు వరకు కొనసాగాయి.